# సాలభంజిక

ఎరైవల్స్ లాంజ్‌లో పల్చగా జనం. ఢిల్లీ నుంచి ఫ్లైట్ వచ్చే రాత్రివేళ చాలసార్లు వాళ్లని రిసీవ్ చేసుకోడానికి వచ్చేవాళ్లు తక్కువే వుంటారు. బాంబే ఫ్లైట్ అయితే యే

వేళప్పుడైనా లాంజ్ కిటకిటలాడుతుంటుంది. విదేశీవిమాన ప్రయాణాలకి ముంబైనే చాల దగ్గర కనక్టింగ్‌లింక్. బయటే డ్రైవర్లు యజమానుల కోసం యెదురు చూస్తున్నారు. వో జంట ఎక్వేరియం దగ్గర నిలబడి పాపకి చేపల్ని చూపిస్తున్నారు. రంగురంగుల బుజ్జిబుజ్జి చేప పిల్లలు అదే పనిగా యీదుతూ పూలబొకేల దుకాణంలో అమ్మాయి పూలపై నీళ్లని స్ప్రే చేస్తోంది. టాటా యెస్.టి.డి. బూత్‌లోని కుర్రాడు యెవరితోనో కబుర్లు చెపుతున్నాడు. కెఫె దగ్గర వొకరిద్దరు నిలబడి కోక్ తాగుతున్నారు. అక్కడో యిద్దరు యిక్కడో యిద్దరు కబుర్లు చెప్పుకుంటున్నారు.

చూపులకి అతిసాధారణ దృశ్యాలివి.

యివి యేవి ఆమె చూపులకి ఆసక్తిని కలిగించటం లేదు. మానిటర్ వైపు చూసింది. ఫ్లైట్ పది నిమిషాలు లేట్. మానిటర్ వైపు నుంచి తిరిగి చూపుల ప్రదక్షిణ.

కోరారంగుకి నలుపు ఆకుపచ్చ యెరుపు ప్రింట్ బోర్డరున్న పోచంపల్లి చీర. నలుపు ఎరుపు ఆకుపచ్చ కలగలిపిన డిజైన్ వున్న జాకెట్టు. మష్రూం హెయిర్ కట్. చిన్ని మెరూన్ బొట్టు. ఐలైనర్ బ్రౌన్ మెరూన్ షేడ్‌లో లిప్‌స్టిక్. యిరవై రెండో మూడో వయసున్న అమ్మాయి. పద్దెనిమితో పంతొమ్మిదో వుంటాయేమో రెండో అమ్మాయికి. స్కిన్ టైట్ జీన్స్ టీషర్ట్‌తో. వాళ్లిద్దరితో బ్లూ టైతో వున్న యువకుడు కబుర్లు చెప్పుకుంటున్నారు. వారి ముఖాలలో నవ్వు ప్రవహిస్తోంది. పక్కనే వో కుర్చీలో అందంగా అమర్చిన పూలగుచ్చాలు.

చిరపరిచితమైన దృశ్యం- మాధురి ఆ వంకే చూస్తుంది. యెయిర్‌పోర్ట్‌లో యిలా యెన్నోసార్లు తను అంజలి నేహ పుష్పగుచ్చాలతో. తమతో సురేషో విన్సెంటో. ఫ్లైట్ లాండ్ అయిన ప్రకటన. కాసేపటికి వొక్కొక్కరూ బయటకి వస్తున్నారు. యిద్దరు విదేశీయులతో యిద్దరు భారతీయులు పుష్పగుచ్చాలతో చిరునవ్వుతో నిలబడిన అమ్మాయిల దగ్గరకి.

హలో... షేక్‌హేండ్స్... మారిన పుష్పగుచ్చాలు...

విదేశీయులిద్దరూ పుష్పగుచ్చాలని అపురూపంగా పట్టుకున్నారు. ఆ రంగుపూల పేర్లు వాటి దేశీయ పరిమళం వివరిస్తూ ఆ అమ్మాయిలిద్దరూ లగేజి వున్న ట్రాలిపై చేతులేసి ముందుకు కదిలారు. ఆ మాటలు ఆలకిస్తూ వారితో మాటలు అడుగులు కలిపిన విదేశీయులు.

వాళ్లు వెళ్లిపోయిన తర్వాత మెల్లగా కదిలిన భారతీయులు.

ఆదృశ్యం తన అనుభవం.

ఆ అమ్మాయిలు వాళ్లతో స్టార్‌హోటల్‌కో. గెస్టుహౌస్‌కో. వ్యాపార లావాదేవీలలో ఆటవిడుపు యీ చిరునవ్వులు.

మూడేళ్లక్రితం యిలాంటి వేళ తడబడే చిరునవ్వు కాళ్ల వేళ్ల వణుకు గుండెల్లోని దడదడా తనని యీజ్ చేయటానికి నేహ తీసుకొన్న శ్రద్ధ గుర్తొచ్చాయి. ఆ తర్వాత అంజలిలో ఆ దడ రొటీన్...చైన్....తను యిమడలేకపోయింది.

'మాధురీ అంతా మిస్‌వరల్డ్ మిస్ యూనివర్స్ కాలేరు. అంతా సినిమా యాక్టర్లు కాలేరు. ఐటి మేనేజ్‌మెంట్ మార్కెటింగ్‌లోకి రాలేరు. నీకా టీచర్ వుద్యోగం రాదు. డాక్టర్‌వి కాలేవు. నువ్వు అందమైన దానివి. వో డిగ్రీ వుంది. నువ్వు పెద్దపెద్ద వుద్యోగాలకి అప్లై చేయలేవు. నీకు పెద్ద డిగ్రీలు లేవు. పోనీ యెక్కడా దగ్గర వో చిన్ని వుద్యోగంలో వుండాలన్నా వుండనివ్వరు. నీ అందం అటువంటిది. వాడిచ్చే బోడి జీతానికి వాడిని మొయ్యాలి. హెరాస్‌మెంట్. సెక్సువల్ హెరాస్‌మెంట్. మనమిచ్చే కంప్లైంట్‌కి ఆర్గనైజ్‌డ్ సెక్టార్‌లోనే దిక్కు లేదు. యీ అనార్గనైజ్‌డ్ సెక్టార్‌లో మన గోల యెవరు వింటారు' నూడుల్స్‌ని ప్లేట్‌లోకి వడ్డిస్తూ 'మంచూరియా బాగుంది కదా' అని అడిగింది నేహ.

సోయాసాస్‌కి టమేటోసాస్‌కి తేడా తెలియనంతగా నాలిక తడి ఆరిపోయి వున్నానేమో యింక మంచూరియా రుచినేం చెపుతా.

ఆమె జవాబు కోసం ఆగకుండా 'సో మాధురీ యిది మంచి కంపెనీ. ప్రతి నెలా విదేశీయులో వేరే రాష్ట్రాలవాళ్లో యెవరో వొకరు వ్యాపార లావాదేవీలపై వస్తారు. వాళ్లు మన అతిథులు. వాళ్లకి యీ సిటీని చూపించాలి- నెక్‌లేస్ రోడ్డు గోల్కొండ హైటెక్ సిటీ శిల్పారామం మ్యూజియం చార్‌మినార్. వాళ్లకి ఫుడ్ అరేంజ్ చెయ్యాలి. డ్రింక్స్‌కి కంపెనీ యివ్వాలి. వాళ్లతో వున్నన్ని రోజులు మన సాంప్రదాయ పద్ధతిలో చీర కట్టుకోవాలి. బొట్టు పెట్టుకోవాలి. ఫెర్‌ఫ్యూమ్, లిప్‌స్టిక్ తప్పనిసరిగా వాడాలి. సెన్సాఫ్ హ్యూమర్ వుండాలి. మన దేశం గురించి వాళ్లకి చెప్పాలి. తాజ్‌మహల్ ప్రేమ గురించి మృదువుగా చెప్పాలి. మన బాడీ విషయంలో కాస్త జాగ్రత్తగా వుండాలి. యే స్థాయిలోనైనా మన శరీర ఆరోగ్యం గురించి మనమే కేర్ తీసుకోవాలి. ఎయిడ్స్ గురించి నువ్వు గుర్తు పెట్టుకో వాళ్లతో అనకు. కేర్ తీసుకోవాలి' ఐస్‌క్రీమ్‌ని ఆర్డర్ చేస్తూ చెప్పింది.

అప్పటికే మాధురీ గొంతు ఆర్చుకుపోయింది. యిటువంటి జీవితం

యెక్కడో నవలల్లోనో సినిమాల్లోనో వొకటుంటుందనేది చూచాయగా తెలుసు కానీ ఆ పాత్ర తనే వేయాల్సిన పరిస్థితి తన ముందుకి రావటంతో ఆమె గొంతు తడారిపోయింది.

విదేశీయులకి యీ నెక్‌లేస్ రోడ్డు యెక్కడ అనుతుంది?! యేమి సైట్ సీయింగో?

'మొదట్లో కాస్త బెరుగ్గా వుంటుంది. మనం వచ్చిన విలువల వలన. కానీ యిది పార్ట్ ఆఫ్ ది జాబ్. తప్పొప్పులు ఆలోచించకు. బయట యెవ్వరికి తెలియదు. మంచి సంస్థ. మంచి డిజిగ్నేషన్. మంచి జీతం. పెర్క్స్. యెవరైనా మంచివాళ్లు కనిపిస్తే వొక్కొసారి ప్రేమా పెళ్లి. అమెరికానో యూరప్పో సమస్యలు తీరుతాయి. మీ వాళ్లు యీ డబ్బులతో వో. సంబంధం చూస్తారు. చేసేసుకో. నచ్చితే వుద్యోగం కంటిన్యూ చేయి లేదా కాస్త దాచుకున్న డబ్బుతో యేదైనా వ్యాపారం మొదలుపెట్టు.' బిల్ పే చేసి టిప్ వదిలి నేహ బయటకి నడిచింది.

ఆమె వెంట తను యెయిర్‌పోర్ట్‌కి. నేహ డబ్బు అవసరం యెదుగుదల చెపుతూనే వుంది.

వుద్యోగ ధర్మమో తనకే తెలియనితనమో మొహమాటమో యేదీ స్పష్టంగా తెలియదు. దడదడలాడే గుండెని నొక్కి పెదవులపై చిర్నవ్వు తళుక్కుమనిపించింది.

'మధూ- యేంటి కలలు కంటున్నావ్' కౌశిక్ పూలగుత్తిని చిలకరిస్తూ అడిగాడు.

పూలపైని బిందువులు తన ముఖంపై.

పర్పుల్‌కలర్ ఆర్కిడ్స్.

'థ్యాంక్‌యూ'. వాటిని అందుకుంటూ చెప్పింది.

యిద్దరూ బయటకి వచ్చారు. అతనిని ఆగమని చెప్పి పార్కింగ్ వైపు వెళ్లి కారు తీసుకొచ్చింది.

కారు మలుపు తిరగ్గానే కౌశిక్ సిగరెట్ వెలిగించాడు. స్మోక్ ఎగ్జిట్ బటన్ నొక్కింది.

'వూ చెప్పమ్మాయి యేంటి కలలు కంటున్నావ్' అడిగాడు.

'కలలు కాదు స్మృతులు. పూర్వ జీవితదృశ్యం కనిపిస్తే' అందామె.

'వో... ఐసీ...' యాష్ ట్రేలో దులుపుతూ అన్నాడు.

వో చేత్తో స్టీరింగ్ కంట్రోల్ చేస్తూ మరో చేత్తో అతని తలని దగ్గరగా తీసుకొని పెదవులపై చిట్టి ముద్దు పెట్టింది. యే.సి.చల్లదనం సిగరెట్టు ఘాటు పరిమళం పర్చుకున్న పెదవుల ముద్దంటే ఆమెకి యిష్టమని అతనికి తెలుసు.

టేప్‌రికార్డర్ బటన్ ప్రెస్ చేస్తూ ఆమె వైపు వాలి పెదవులపై చప్పున ముద్దు పెట్టాడు.

పార్కింగ్‌లో కారు పార్క్ చేసి ఆర్కిడ్స్ తీసుకొని లిఫ్ట్ వైపు నడిచింది. అప్పటికే కౌశిక్ లిఫ్ట్‌లో వున్నాడు.

కాలింగ్ బెల్ నొక్కబోతూ ఆగి 'నిద్రపోతుంటుందా' అడిగాడు.

'నిద్రపోదు. నిద్రపోతే ఆంటి లోపల స్విచ్ ఆఫ్ చేస్తారుగా' అంటూ మాధురి కాలింగ్ బెల్ ప్రెస్ చేసింది.

నాన్నమ్మ చేతుల్లోంచి డాలీ నవ్వుతూ తండ్రి చేతుల్లోకి వెళ్లిపోయి చిన్ని చిన్ని వేళ్లతో అతని గెడ్డాన్ని లాగటం మొదలుపెట్టింది.

ఆడుకొని ఆడుకొని మెల్లగా నిద్రపోయింది.

'యెందుకలా వున్నావ్? అటువంటి విషయాలు యెందుకలా పదేపదే ఆలోచిస్తావ్' ఆమె తల మీద చేయి వేసి దగ్గరకి తీసుకుంటూ అడిగాడు కౌశిక్.

అతని కాలర్‌బోన్‌పై తలవాల్చి అతని చేతి వేళ్ల గోళ్లపై చేతివేళ్లతో స్పృజిస్తూ 'మర్చిపోదామన్నా యెందుకో అలా అవి గుర్తొస్తునే వుంటాయి' అంది.

'జీవితంలో గడిచిపోయిన ఫేజ్‌ని తిరిగితిరిగి ఆలోచిస్తూ వుంటే - ముఖ్యంగా మనలని బాధపెట్టినవాటిని - వర్తమానంలో కూడా మనం ఆనందంగా వుండలేం. యిప్పుడు నీకేం లోటు. మనిద్దరం వొకరికొకరం వున్నాం. మన బిజినెస్ కూడ యింప్రూ అయింది. పిల్లలు పుడతారో లేదో అనుకునేవాడిని. ఫర్ ది గ్రేస్ ఆఫ్ గాడ్ మనకో పాప. బాగున్నాం కదా. వూరికూరికే ఆలోచిస్తావ్'.

నిజంగా బాగున్నట్టేనా?!

లోపలి ప్రశ్నలకి దిగులకి కౌశిక్ దగ్గరేం దొరకదని తెలుసు. దిగులుపడితే ఆ దిగుల్ని పోగొట్టటానికి అనేక విధాల ప్రయత్నించటం తనూ దిగులుపడిపోవటం.

'నిజంగానే మనం బాగున్నాం. వొక్కోసారి యెందుకో అలా గతం నన్నీడ్చుకుపోతుంటుంది. ముంబై యేమంది' అడిగింది.

'పనైయింది. రెండుమూడ్రోజుల్లో డాక్యుమెంట్స్ వచ్చేస్తాయి. సమ్మర్ ఫెయిర్ పెడతారంట. రేపట్నుంచి నీ పనేంటంటే ఏసియన్ కంట్రీస్ నుంచి అమెరికా వెళ్లినవాళ్లని దృష్టిలో వుంచుకొని డిజైనింగ్ చేయటం. మోడల్స్ లిస్ట్ వచ్చేవారం వస్తుంది. యీ సారి బ్రైట్ యిండియన్ కలర్స్ వాడితే'

'కాషాయం.....పసుపు.... ఆకుపచ్చ....

'వూ...రేపు చూడా రంగులు...యిప్పుడు రంగులొద్దు...కలలు...అతన్ని అల్లుకొంటున్న నిద్ర.

ఆమె మెడ వరకు బ్లాంకెట్ కప్పుకొని మెల్లగా పక్కకు తిరిగింది పొరలుపొరలుగా జ్ఞాపకాలు.......

లేతాకాశపు రంగు క్యాబిన్.

'యిలాగైతే యెలా? యెందుకంత భయపడతావ్? వాళ్లూ మనుష్యులేగా. ఆసక్తిగా లేరా? గిఫ్ట్సు యేమి యివ్వటం లేదా? అలా బెంబేలుపడకు' నేహ చెపుతూనే వుంది.

మాధురీ చూపులన్ని పొందిగ్గా అమర్చిన పువ్వులపై నుంచి నేహ వైపుకి. తిరిగి పువ్వులపైకి.

'యిప్పటి వరకు నీపై కంప్లైట్స్ లేవ్. సిటీ హిస్టరీ యిండియా కల్చర్ మ్యూజిక్ - యేదైనా సరే చక్కగా చెపుతావని చెపుతారు. సెన్సాఫ్ హ్యూమర్ చిర్నవ్వు నీలో వున్నాయి. యీ ప్రొఫెషన్‌కి చాల ముఖ్యమైనవి. ముఖ్యమే కానీ యెక్కడైనా దొరుకుతుంది కాని మిగిలిన అన్నింటితో కలిపి వుండటం ముఖ్యం కదా. వేరే డిపార్ట్‌మెంట్‌కి మారిపోవటం అంటే యే డిపార్ట్‌మెంట్‌కి వెళతారు? మార్కెటింగ్ యం.బి. యే. లేదు పర్చేసింగ్ మెటీరియల్స్ మేనేజ్‌మెంట్‌లో స్పెషలైజేషన్ వుండాలి. ఫైనాన్స్ ఛార్టడ్ అకౌంటన్సీ వుండాలి. సెక్రెటేరియట్ యే.సి.యస్. లేదూ పోని ఐటికి వెళతారా అంటే మీకా ఫీల్డ్‌లో నాలెడ్జ్ నిల్. పోనీ యిప్పుడు నేర్చుకోవటం మొదలుపెట్టినా అంత ఫీజ్ యెలా కడతారు. ఆ కోర్స్ యెలా పూర్తి చేస్తారు? అంతంత ఫీజులని మీరెలా తట్టుకుంటారు? అంత వరకు మీ ఫ్యామిలీని యెవరు సపోర్ట్ చేస్తారు' నేహ మానిటర్ వైపు నుంచి చూపులని మాధురీ వైపు నిలుపుతూ అంది.

క్యాబిన్ తలుపుని కాస్త లోపలికి జరిపి 'యెక్స్‌క్యూజ్ మీ' ట్రేతో లోపలికి వచ్చి యిద్దరి ముందు కాఫీ కప్పులుంచి వెళ్లిపోయాడు ఆఫీస్‌బాయ్.

చిక్కని దక్షిణాది కాఫీ సువాసన గొంతులోకి జార్తుంటే 'మీ బ్రదర్స్ యిద్దరు స్టేట్స్ వెళ్లే వరకు వోపిక పట్టండి. యీలోగ కొద్దిగా డబ్బులు దాచుకోండి. ఆ డబ్బులతో యేదైనా వ్యాపారం... బాటిక్. కాస్మెటిక్స్. చెప్పుల కొట్టో... యేదో వొకటి కానీ అవి కూడా పాష్ లొకాలిటిలోనే పెట్టాలి. షో వుండాలి. మీరు వెళ్లిపోతే యిక్కడెవ్వరూ దొరకరని కాదు. మీకూ తెలుసు. యీ వుద్యోగానికెంత కాంపిటేషన్ వుందో. అసలీ రోజు కాంపిటేషన్ లేని ఫీల్డ్ వుందా' మృదువుగా అడిగింది నేహ.

మాధురీని అయోమయం ఆవరించింది.

యీ వుద్యోగంలో చేరిపించడానికి ఆమె తనని వొప్పించే ప్రయత్నం చేసినప్పుడు కలిగిన అనుభూతులకి అనుభవం లేదు. యింట్లో చికాకులని నిస్సహాయంగా చూస్తుండలేక పోయాను. బేలగా బాధపడుతూ యింట్లోనే వుండలేకపోయాను. కానీ పార్టు టైం వుద్యోగం కూడా దొరకని పరిస్థితి. దొరికిన చిన్ని జీతం అలసటే తప్ప అవసరాలేం తీరకపోవటం... మంచి సంస్థ నుంచి యింటర్వ్యూకి రమ్మని పిలుపు సంబరపడిపోయాను. వాళ్లు అనుభవజ్ఞులు. అవసరాలని బాగ గుర్తుపట్టారు. వాళ్లకి తెలుసు యెవరిపై యే ప్లేకార్డు వాడాలో. అవసరాలే ప్రాతిపదిక.

వాళ్ల అవసరానికి యెంతగా న్యాయం చేసానో తెలియదు. యింటి అవసరాలని యెంత మేరా తృప్తిపరిచానో కూడా తెలియని స్థితి. అవ్యక్త వుద్యోగ స్వరూపం కాలుస్తోంది సమస్తాన్ని.

అమ్మకి అంతా చెప్పేస్తే.?! కంగారుపడుతుంది. బాధపడుతుంది. భయపడుతుంది. కోప్పడుతుంది. యేమన్నా పర్లేదు. ముందీ స్థితి నుంచి బయటకి వచ్చెయ్యాలి.

ఆమెకి కాస్త తేటపడ్డట్టుగా అనిపించింది.

'ఆలోచించకండి. మెకానికల్‌గా జాబ్‌లో యిన్వాల్వ్ అవ్వండి. సీయూ...బై...' నేహ తేల్చేసింది.

వీకెండ్‌కి మాధురీ యింటికి వెళ్లింది.

మధ్యాహ్నం భోజనాలు అయిన వెంటనే తమ్ముడు బయటకి వెళ్లాడు. చెల్లాయి స్నేహితులతో సినిమాకి వెళ్లింది. మెయిల్ చూసుకోడానికి అన్నయ్య నెట్ సెంటర్‌కి వెళ్లాడు. నాన్నగారు నిద్రపోతున్నారు. వంటింట్లో పని చేసుకుంటూనే టి.వి.లో సినిమా చూసేస్తోంది అమ్మ.

చెపితే యిప్పుడే చెప్పాలి. తిరిగి రాత్రికే ప్రయాణం. కాసేపైతే అంతా తిరిగి వచ్చేస్తారు. యెలా చెప్పాలి? యీ వుద్యోగంలో యిమడలేను. యిలాంటి పరిస్థితిలో చిక్కుకున్నప్పుడు యిమడటం అనే ప్రశ్నే లేదేమో. సర్దుకుపోవాలేమో. వారివారి కన్నీళ్లకి భవిష్యత్తులో చరిత్రగా రికార్డు చేసే అవకాశమైనా వుందా? వుద్యోగరీత్యా చిరునవ్వు చిందించటం యెంత కష్టమో. అపరిచిత దేహానికి దేహం విచ్చుకోవటం యెంత దుఃఖదాయకమో. అలవాటైన దుఃఖాన్ని యెప్పటికప్పుడు కొత్తగా దుఃఖించటం. అనుభవంలోంచి గాయం సలుపుతుంటే 'వుద్యోగం మానేస్తా' అమ్మతో చెప్పాను.

'యెందుకు' మినప్పప్పు కడుగుతూ అడిగింది.

'యేదైనా యింకోటి వెతుక్కుంటా'

'అన్ని నెలలు కష్టపడి సంపాదించుకున్న వుద్యోగం వదిలేస్తావా? యెందుకు? నిక్షేపంలాంటి సంపాదన. అన్నయ్య అమెరికాకి వెళ్లాల్సిన పేపర్లు నెలాఖరికి వచ్చేస్తాయంట. అవి వచ్చేస్తే వాడు వెళ్లిపోతాడు. కాస్త తేరుకున్నాక వాడు కొన్ని డాలర్లు పంపిస్తాడు కదా. అప్పుడింత యిబ్బంది వుండదు. చిన్నాడికి యింకా నలభైవేల ఫీజ్ కట్టాల్సింది వుంది. వాడు వచ్చే యేడాది అమెరికా వెళ్లిపోతాడు. వాడూ కాసిన్ని డాలర్లు పంపిస్తాడు. చెల్లాయి చదువుకి యిబ్బంది వుండదు. చిన్నోడికి కంప్యూటర్ కావాలంట. ఆ లాబ్‌లో యెక్కువసేపు ప్రాక్టీస్ చేయటానికి దొరకదంట. యింట్లో వుంటే ప్రాక్టీస్ చేసుకోవచ్చంట. అన్నయ్య స్టేట్స్ వెళ్లిపోతాడు కదా యింట్లో కంప్యూటర్ వుంటే మెయిల్ చేసుకోవచ్చు. బయటకి వెళ్లాలంటే నాకెక్కడ వీలవుతుంది చెప్పు' జార్‌లో మినప్పప్పు వేస్తూ అంది అమ్మ.

మిక్సీ బర్‌బర్రని తిరుగుతోంది.

నాన్నగారి వొక్కరి సంపాదనా సరిపోకే త్వరగా వుద్యోగం వెతుక్కోవల్సి వచ్చింది. ఆ సంస్థలో నేనో ఆఫీసర్‌నని యింట్లో అందరికి తెలుసు. పెద్దవాళ్లతో డీలింగ్ అని తెలుసు. కాని యీ వుద్యోగంలో వున్న వొక ముఖ్యమైన పని వాళ్లకి తెలియదు.

'యెక్స్ఛేంజ్ సేల్ వచ్చినప్పుడు యీ మిక్సీ మార్చాలి. పాతదైపోయింది. అరిగిపోయింది. యిప్పుడు చాల రకాలవి వస్తున్నాయి కదా. చపాతిపిండి కూడా కలుపుకోవచ్చు. జ్యూసర్ దొరికితే యీ సారొచ్చినప్పుడు పట్రా' జార్‌లోంచి పిండిని గిన్నెలోకి తీస్తూ చెపుతోంది.

'అరటికాయ బజ్జీలు వేద్దాం. వో నాలుగుకాయలు తరుగు' అంది.

చేతికి నూనె రాసుకొని అరటికాయ చెక్కు తీస్తూ 'వుద్యోగం నచ్చలేదు' అన్నాను.

'యెందుకనీ? యే వుద్యోగమేనా యేదో వొక గొడవ వుంటుంది. మీ నాన్నగారిని అడుగు చెపుతారు. పై వాళ్లతో కింది వాళ్లతో యేదో వొక చికాకు. సర్దుకుపోవాలి' కళాయిలో నూనె పోస్తూ అంది.

'మీ బాస్ డిన్నర్‌కి రమ్మని సతాయిస్తున్నాడా? ఆడాళ్లని యేదో వొకటి అలా అంటుంటారు. అందంగా వుంటావ్ కదా. యింకాస్త యెక్కువ చికాకు వుంటుంది. లౌక్యంగా మెసులుకోవాలి అంతేకాని అలా బెంబేలుపడిపోతే యెలా' మరిగిన నూనెలో శెనగపిండిలో ముంచిన అరటికాయ ముక్కలు వేస్తూ అందామె.

మధ్యాహ్నపు గాలులకి పెరట్లో చెట్ల కొమ్మలు అప్పుడప్పుడు వూగుతూన్న సవ్వడుల నడుమ నుంచి 'డిన్నర్... నీకెలా తెలుసు' గొంతు తడారిపోతోంటే అడిగాను.

'యింట్లో వుండే మీ అమ్మకి ప్రపంచం తెలియదనుకున్నావా? తెలుసు టి.వి.లో సీరియల్స్ చూస్తున్నాంగా. అవును ఎగ్జిబిషన్‌లో ఎలక్ట్రిక్ కుక్కర్ అమ్ముతారంట కదా. మంచిదొకటి యీసారి పట్రా. చిన్నోడు క్లాసు నుంచి వచ్చేసరికి పదో పదకొండో అవుతోంది. అందులో అన్నం వండితే యెంత సేపైనా వేడిగా వుంటుందంట కదా' అంది అమ్మ.

యింట్లో కాస్త యిబ్బంది లేకుండా యింకాస్త రాబడి వుంటే బాగుంటుందనుకున్నాం. వుద్యోగానికై వెతుకులాట. యిబ్బంది తీరటం యెలా వున్నా అవసరాల చిట్టా పెరుగుతూనే వుంది. యెవరినేం అన్నా యేడవటం. అలకలు. పస్తులు. అరుపులు. యెలాగోలా సరిపెట్టుకొని యెవరికి దొరికిన వుద్యోగంలో వాళ్లని చేరిపోమంటే? డిన్నర్‌కి పిలిచి చెయ్యి పట్టుకోవటమో కళ్లల్లోకి చూపులు జార్చటమో కాదమ్మ. యిప్పుడే లౌక్యాలు అక్కర్లేదు. యే ముసుగులూ లేవ్. అవసరాలే మేధస్సు శరీరమూ పెట్టుబడి అంతే.

'బట్టలు ఆరాయేమో చూడు యేం గాలో' అమ్మ అంటుంటే పెరట్లోకి వెళ్లి ఆరిన బట్టలు తీస్తూ 'యింక యీ విషయం అమ్మ మాట్లాడదన్నమాట' అనుకొంది మాధురి.

కాసేపయిన తర్వాత మాధురీ వంటగదిలోకి ఆరిన బట్టలతో వచ్చేసరికి తల్లి లేదక్కడ. పక్కింటావిడకి బజ్జీలు యివ్వడానికి వెళ్లి కబుర్లు చెపుతూ కనిపించింది. యిక యీ విషయం మాట్లాడే ఛాన్స్ లేదని మాధురీకి పూర్తి నిర్ధారణ అయింది.

నెలాఖరుకి అమెరికా వెళ్లటం ఖాయం. వెలుగు చిమ్ముతోన్న చూపులతో నెట్ సెంటర్ నుంచి వచ్చిన పెద్దాడికి మంచినీళ్లు యిస్తూ 'త్వరగా సెటిల్ అయి యింటిని కాస్త పట్టించుకో' చెపుతోంది అమ్మ.

విశాఖ సంపెంగలని మాల కట్టి అరిటాకులో చుడుతూ 'రైల్లో తినటానికి యేం కట్టమంటావ్' అడిగారామె.

'యేదో వొకటి. అయినా ట్రైన్‌లో దొరుకుతాయిలే' అంది మాధురి.

'అవేం బాగుంటాయ్' అంటూ జానకి వంటగదిలోకి వెళుతూ 'మధూ' పిలిచారు.

ఆమె వెనకే మాధురి.

'నీది యెలాంటి చికాకైనా కాస్త సర్దుకుపోమ్మ. నువ్విప్పుడు వుద్యోగం మానేస్తే వీళ్ల చదువులకి చాల కష్టం అవుతుంది. యింటి పరిస్థితి చికాకుగా అయిపోతుంది. కొన్నాళ్లు కష్టపడితే అంతా వొక దారికి వస్తారు. నాలుగు డబ్బులు వెనకేసుకుంటే నీ పెళ్లి చెయ్యొచ్చు. పొరపాటున కూడా వుద్యోగం మానెయ్కు. యెక్కడైనా మగాళ్లతో యేదో వొక చికాకు వుంటుంది కద తల్లీ. కాస్త వోపికపట్టు' బతిమాల్తున్నారు జానకి.

ఆమె మాటల వెనుక నిస్సహాయత ఆవేదన స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమెకి యెలా విడమర్చి చెప్పాలి?

స్టేషన్‌కి బయలుదేరే ముందు సంపెంగల పొట్లం చేతిలో పెడుతూ 'కాస్త వోపిక పట్టు. మీ నాన్నగారి ఆరోగ్యం కూడా అంతంతే...' కళ్లనీళ్ల గొంతు జారి మాటలు లోలోపలే ఆగిపోతోంటే మాధురీ తలపై చేయి వేసి నిమిరారు.

నిస్సహాయంగా యింట్లోంచి బయటకి కదుల్తూ వెనక్కి చూసింది. మూర్తీభవించిన నిస్సహాయత అమ్మగా నిల్చుంది గుమ్మం దగ్గర. 'అంత భరించరాని కష్టం యేం కాదమ్మా. వూరికే అలా అనిపిస్తుంది అప్పుడప్పుడు. బెంగపడకు. కుక్కర్ పట్టుకొస్తా' అప్రయత్నంగా చిర్నవ్వుతో చెప్పేసింది.

ఆమెనెందుకు బాధపెట్టాలి. వొంటరిగా కన్నీరు కార్చటం నేర్చుకుంటే సరి.

* * *

'యీమె అంజలి' వో రోజు వో పద్దెనిమిదో పంతొమ్మిదో వున్న అమ్మాయిని తీసుకొచ్చి మాధురికి పరిచయం చేసింది నేహ.

అంజలి యెక్కువగా మాట్లాడేది కాదు. పలకరింపుగా నవ్వేది.

వో రోజు ఎయిర్‌పోర్ట్‌లో ఫ్లైట్ కోసం యెదురు చూస్తున్నాం.

'డాడీకి పొలిటికల్ యిన్‌ఫ్యులెన్స్ వుంది. యింట్లో అందరికంటే చిన్నదాన్ని. చాల ముద్దుగా చూస్తారు. వోన్‌గా వుండాలనుకుంటున్నాను. నాక్కావల్సింది సంపాదించుకోకపోతే యింట్లో వాళ్లని అడగాలి. బాగ ఖర్చు దేస్తా. యింట్లో వాళ్లపై ఆధారపడితే వాళ్లు చెప్పినట్టు వినాలి. స్పేస్ అంతా పోతుంది' అంజలి చెపుతోంది సురేష్‌తో.

శ్రద్ధగా వింటున్నట్టు తలూపుతున్నాడు సురేష్.

అంజలి ఆఫీసులో జాయిన్ అయి రెండు నెలలు అయింది.

మాధురీ మంత్లీ యెక్స్‌పెండీచర్ స్టేట్‌మెంట్ కంపోజ్ చేస్తుంటే సురేష్ వచ్చాడు.

'భలే పోరి. నోరు విప్పితే గప్పాలేగప్పాలు. వాళ్ల నాన్న దివాల తీసిన పెంకుల వ్యాపారి. వాళ్ల అన్న లోకల్ యం.యల్.యే దగ్గర బ్రోకర్. వాళ్ల అన్నావదినలది వేరింటి కాపురం. పెళ్లి కావల్సిన అక్కలిద్దరున్నారు. అంజలి సంపాదించి యింటికి పంపిస్తేనే తిండి తినటం. యింతకు ముందు గోవాలో టూరిస్టు సీజన్‌లో పని చేసింది. అక్కడి యెక్సిక్యూటివ్ నేహా మేడమ్‌కి తెలుసంట. వాళ్ల వూరికి దగ్గరగా అంజలి వుండాలనుకుంటుంటే ఆమె నేహా మేడమ్‌ని అడిగారంట. అంజలికి వాళ్ల అమ్మగారిని మూడునాలుగు నెలలకోసారి చూడకపోతే బెంగగా వుంటుందంట. అంజలి మాత్రం నోట్లో వెండి స్పూన్ పెట్టుకొని పుట్టినట్టు కబుర్లు చెపుతుంది. బీర్‌బాటిల్ కోసం యెవడి బండైనా యెక్కేస్తుంది. అంజలికి బాగ డబ్బులు కావాలి ఆమె అ....

'సురేష్ యీ స్టేట్‌మెంట్ ప్రింట్ తీయాలి. యెందుకో సరిగ్గా రావటం లేదు. రాంగ్ కమాండ్ అనుకుంటా. కాస్త చూస్తావా' చప్పున అడిగి అతని మాటలని కట్ చేసేసింది ఆ సమయానికి.

మగపిల్లలకేం తెలుస్తాయి అమ్మాయిల ఆనందవిషాదాలు.......

వో గట్టి ప్రయత్నం మీద వో స్టార్ హోటల్లో రిసెప్షనిస్ట్ వుద్యోగం వచ్చింది. ఆలశ్యం చేయకుండా మాధురీ జాయిన్ అయిపోయింది. జీతం ఆ వుద్యోగంలో కంటే తక్కువే అయినా యీ అవకాశాన్ని వదులుకోదల్చుకోలేదు. యింట్లో అవసరాలు బెంబేలుపడ్డాయి. లోపలి సెగ కంటే ఆయింటి గొడవని భరించటానికే సిద్ధపడిందామె.

వో రోజు అంజలి వచ్చింది ఆకస్మికంగా. మెరుపు సంశయం కలబోసిన చూపుల్తో.

కౌంటర్‌లో మాధురి బాగ బిజీగా వుండటంతో ఆమె పని పూర్తి అయ్యే వరకు లాంజ్‌లో యెదురుచూసిందామె.

యిద్దరు బయటకి వచ్చారు.

అంజలిని తను పేయింగ్ గెస్ట్‌గా వుంటున్న యింటికి తీసుకువెళ్లాలనిపించలేదు మాధురీకి. అంజలికి తనకి స్నేహం లేదు. పని పరిచయం తప్పా యేం తెలియని వాళ్ల ముందు జీవితాలని పరిచేస్తే తర్వాత మనల్ని మనమే నిందించుకోవాలి. 'యెక్కడ కూర్చుందాం' మాధురీ అడిగింది.

తనున్న చోటుని మాధురీకి చూపించటం అంజలీకి యిష్టం లేదు. క్షణక్షణం కంపోజ్డ్ బిహేవియర్.

రెస్టారెంట్‌లో కూర్చున్నారు.

'మనం యిలా కల్సినట్టు యెవ్వరికి చెప్పకండి. అసలు యే విషయాలూ చెప్పకండి. నాకు డబ్బులు అవసరమే చాల. కానీ యిలా సంపాదించాలని యెప్పుడూ అనుకోలేదు. నాన్నది బాధ్యతారహితం. అన్నయ్యది పెత్తనం. పిల్లల జీవితాలు యిలా యెందుకైపోతాయ్ తండ్రుల వల్లే. ఆ యింటిని నిలబెట్టటానికి మా అమ్మ యెంత కష్టపడుతుందో. నేనిలాంటి వుద్యోగం చేస్తున్నానంటే మా అమ్మ బాధపడుతుంది. మా నాన్నకేం వుండదు. మగాళ్లతో తిరిగితే తిరిగావ్ కానీ కడుపు తెచ్చుకోకు అనే రకం మా అన్న. విషయమేమిటంటే.... మీరు మంచివారని తెలుసు. యెక్కడా యేం మాట్లాడరని తెలుసు. విషయం యేమిటంటే సురేష్ ప్రేమిస్తున్నానంటున్నాడు' అని ఆగిపోయింది అంజలి.

కన్నార్పకుండా ఆమెనే అట్లా చూస్తుండిపోయింది మాధురి.

అంజలి యిదంతా యెందుకు చెపుతోంది?

వొకే చోట వున్నంతకాలం ఆమె యెప్పుడూ యేం మాట్లాడలేదు 'హలో' కి మించి సాగని సంభాషణ యీ రోజు యిలా.

'అసలు పీస్ లేకుండా పోయిందండి. పీస్ కావాలి. యిల్లు కావాలి. కారు బ్యాంక్ బ్యాలన్స్ కావాలి. మాయింట్లో పెళ్లి చేసే స్తోమతు లేదు. లేచిపోవాలి లేదా పారిపోవాలి. యీ రోజుల్లో అలాంటి సాహసాలు చేసే మగవాళ్లూ యెవ్వరూ లేరు. సురేష్ యిక్కడ జాబ్ మానేస్తాడంట. కాంట్రాక్ట్స్ చేద్దామనుకుంటున్నాడు. సంపాదించగలడు. చూడటానికి బాగుంటాడు. ప్రేమగా వున్నాడు. పెళ్లి చేసుకుందాం అన్నాడు. మంచివాడేనా' అడిగిందామె.

'యేమో. మనం జీవితం పంచుకోవాలనుకుంటున్న వ్యక్తులు యెలాంటివాళ్లో యెవరికి వాళ్లే తెలుసుకోవటం మంచిదేమో' సురేష్ అంజలీని గతంలో పల్చగా మాట్లాడటం గుర్తున్నా మాధురీ చెప్పకుండా అలా అంది.

అతని అభిప్రాయం కాలంతో మారిందేమో. లేకపోతే పెళ్లి అనడుకదా. అవి యిప్పుడు చెప్పి అంజలీని బాధపెట్టటం యెందుకు?

'నాకో చెత్త ఆలోచన వచ్చిందండి. నాతో బిజినెస్ చేయించడు కదా... లేదా పెళ్లికి ముందు యెలా తిరిగినా పెళ్లయ్యాక కుదురుగా వుంటే చాలు అనుకునే బాపతేమో' అందామె నవ్వుతూ.

మరో కాఫీ ఆర్డర్ చేసారు. రెస్టారెంట్ కిటకిటలాడుతోంది. మ్యూజిక్ యెవరి మాటలని పక్కవాళ్లకి వినిపించనివ్వటం లేదు.

'మీకు నా కంటె ముందు నుంచి సురేష్ తెలుసు కదా. యెలాంటి వాడంటారు' అంజలి తిరిగి అడిగింది.

యిబ్బందిగా అనిపిస్తున్నా ఆమెని యెలా కట్ చెయ్యాలో తెలియటం లేదు. సురేష్ లోపల యేమిటో నిజంగా తెలియదు. అసలు యేం మాట్లాడితే యేమిటో?! వాళ్లిద్దరూ వొక నిర్ణయానికి వచ్చారో లేదో తెలియదు. యే మాటలు ఆమె నిర్ణయంపై యెలాంటి ప్రభావం చూపిస్తాయో తెలియదు.

'సురేష్‌కి నేనంటే యిష్టమే. బాగ వెతుక్కుంటాడు. ప్రేమగా వుంటాడు. అతని అందానికి నే చాల యెక్కువ. నే వొప్పుకుంటే చాలంటున్నాడు. భార్యగా నాపట్ల పాజిటీవ్‌గానే వుంటాడనిపిస్తోంది. చేసుకుంటే మంచిదనిపిస్తోంది.

చేసుకోనా' అడుగుతోంది అంజలి.

'ఆల్ ది బెస్ట్ అంజలి' మాధురి మనస్ఫూర్తిగా చెప్పింది.

* * *

మార్నింగ్ షిఫ్ట్.

వుదయం ఫ్లైట్‌కి వెళుతోన్న గెస్ట్స్ బిల్స్ ఫీడ్ చేస్తోంది మాధురి.

'హాయ్ మేడమ్ నిన్నంతా కనిపించలేదు' వినిపిస్తే తలెత్తి చూసింది.

కౌశిక్...

'హాయ్. వీక్‌లీ ఆఫ్.. యేంటి వెళుతున్నారా? తిరిగి యెప్పుడొస్తారు' అడిగింది.

'పది రోజుల తర్వాత'

అతను తరచుగా అదే హోటల్లో వుండటం. పరిచయం. పలకరించుకోవటం.

పదిరోజుల తర్వాత కౌశిక్ వచ్చాడు. డల్‌గా వున్నాడు.

'డల్‌గా వున్నారేంటి' అడిగింది మాధురి.

'యెక్కడైనా కలవగలరా' అడిగాడు.

క్లబ్‌లో కలిసారు.

స్విమ్మింగ్‌పూల్ పక్కన టేబిల్‌కి అటూ యిటూ కూర్చున్నారు. వాలిన కొబ్బరాకు చీలికల్లోంచి రెల్లుపూల జల్లులా లేత వెన్నెల. యిద్దరి ముందు ఆరెంజ్ జ్యూస్‌లో యింకుతోన్న వోడ్కా. వినీ వినిపించని ట్రేసీ స్వరం.

'బిజినెస్‌లో చికాకులు. కష్టపడి అంతా యెస్టాబ్లిష్ చేసా. చివరికి మరొకరికి పర్మిషన్ యిచ్చేసారు. తిరిగి మొదట్నుంచి వర్క్‌వుట్ చెయ్యాలి' అన్నాడు.

'యేం బిజినెస్'

'ఫ్యాషన్ డిజైనింగ్'

అతని దిగులుని ఆమె పంచుకొంది. యిద్దరూ కాస్తకాస్తగా జీవితాలని పరుచుకున్నారు.

అతని సమక్షంలో ఆమె అనాచ్ఛాదిత.

యే గడియల్లో అతనిపై విశ్వాసం కలిగిందో ఆమెకి తెలియదు.

'మధూ నీ పెళ్లి బాధ్యత నాదే. అబ్బాయిని వెతుకుతాను' అన్నాడో రోజు ఆమె కనురెప్పలపై పెదవులు ఆన్చి.

అతని మెడ చుట్టూ వున్న ఆమె చేతులు అప్రయత్నంగా అతనిని మరింత గాఢంగా పెనవేసుకున్నాయి.

'మనిద్దరం వొకరి లోపలి విషయాలని వొకరు పంచుకొన్నాం. దేహాలతో మాట్లాడుకున్నాం. వొకరిపట్లవొకరం తడిగా వున్నాం. కానీ పెళ్లి మాత్రం మరొకరితో అంటున్నాం. గొప్ప నమ్మకంతో ప్రేమగా యే అచ్ఛాదనలూ లేకుండా వ్యక్తం చేసుకొని వొకరికి మరొకరు అత్యంత సామీప్యానికి వచ్చి కూడా జీవితానికి పూర్తిగా హత్తుకొనే అనుబంధాన్ని మాత్రం యెందుకు వద్దంటున్నాం. వేరే వెతుకులాట యెందుకు? మనం మన జీవితంలో పార్టనర్‌గా వుండేవాళ్ల నుంచి యేం కోరుకుంటున్నాం తెరల్లో వుండాలనుకుంటున్నామా? మనలోని ఆకర్షణీయమైనది వున్నతమైనవి అనుకున్నవి మాత్రమే వొకరికొకరం ప్రెజెంట్ చేసుకోవాలనుకుంటున్నామా? జీవితాన్ని పంచుకోవటం అంటే యేమిటి? లోపల్లోపలి అశాంతి యే పరస్పరానుభవం వల్ల రవ్వంతగా కదుల్తుందో అది యేది? యే పరిమితులు పెళ్లి అనే ఆలోచనని యివ్వటం లేదు' ఆమె ఆ ప్రశ్న వేయకుండా వుండలేకపోయింది.

వింటున్న అతని చూపుల్లో యే కదలికా లేదు.

అలజడిని అలా బయటకి చెప్పకుండా వుండాల్సిందా? అతని సామీప్యంలో తనని తాను నిండుగా వ్యక్తపర్చుకోవటం. అలా వ్యక్తపర్చుకోలేకపోతే అతను అందరిలో వొకడే కదా. అవ్యక్త ప్రేమలెందుకు? వదులొదులు పరిచయాలు స్నేహాలు కాదిప్పుడు తనకి కావల్సింది. గాఢత పెనవేసుకోవాలి. యెదురు చూపు. కనిపిస్తే సంబరం. కనిపించకపోతే దిగులు. వేకువలో అతని కోసం తడుముకునే చేతులు. భవిష్యత్తులో గత జ్ఞాపకాలుగా మిగిలిపోవల్సిందేనా?! గత స్మృతుల్లోంచి కాక మనోస్పర్శ జీవితమంతా ప్రవాహంలా స్పర్శించాలి.

ఆమె అతనికి చెపుతూనే వుంది.

'నో...నోవే'... అతను లోపల్లోపల కూడపలుక్కుంటున్నాడు.

కోల్పోతున్న గాయంతో ఆమె దైనందిన జీవితంలో అటుయిటూ తిరుగుతుంది. కానీ లోలోపల సెగ రాజుకుంటుంది. అతను తన నుంచి యెందుకు దూరంగా వుండాలనుకుంటున్నాడు. తన గత జీవితం వలనా?!

చుట్టూ దట్టమైన మాయ. ఆ పొరలు నమ్మకోకుండా నిలువరించే శక్తి యెవరి జీవితాలకైనా వుందా?

ఆదివారం.

డ్యూటీ లేదు. ఐబ్రోస్ త్రెడ్డింగ్ చేయించుకొని పెడిక్యూర్ మెనిక్యూర్ పూర్తి అయ్యాక తలకి గోరింటాకు పెట్టించుకొని మాధురి వో పక్కగా కూర్చుని చీరకి ఫాల్ కుట్టుకుంటుంది. వారానికోసారి బ్యూటీషియన్ మొత్తం సరంజామాని తీసుకొని మాధురి పేయింగ్‌గెస్ట్‌గా వున్న యింటికి వస్తుంది. అమ్మాయిలంతా కావల్సినవన్నీ చేయించుకుంటారు.

'మధూ నే బ్లంట్ కట్ చేయించుకోనా?! బాగుంటుందా' అడిగిందో పొడవు జుట్టున్న అమ్మాయి.

'యెందుకు తల్లీ అంత తొందర. నువ్వేం కష్టపడక్కర్లేదు. యీ పొల్యూషన్‌కి అదే వూడిపోతుంది. గుండు కాకుండా వుంటే సంతోషించాలి' ఫేషియల్ చేయించుకుంటున్న అమ్మాయి అరిచింది.

'మధూ నీకోసం యెవరో వచ్చారు' ఆంటి చెప్పారు.

నాకోసమా?! స్నేహితులెవరూ లేరు. యింట్లోవాళ్లు చెప్పకుండారారు. యెవరై వుంటారు? అంజలి... వెతుక్కుంటూ వచ్చేసిందేమో.

మాధురి లివింగ్ రూంలోకి వచ్చింది.

యంటివి ఛానల్ చూస్తున్న అమ్మాయిల మధ్య కూర్చుని గుమ్మం వైపు చూస్తున్నాడు కౌశిక్.

ఆశ్చర్యం సంబరం తుళ్లింతగా.

'అరగంట వుండగలవా' అడిగింది.

'వూ'

తలస్నానం చేసి సీగ్రీన్ షిఫాన్ శారీ కట్టుకొని బయటకి వచ్చిందతనితో.

కురుల్లోంచి అతని తాకుతోన్న గోరింట పరిమళం మత్తుగా.

రెస్టారెంట్‌కి వెళ్లారు.

మసక వెల్తురు. పియానో మెత్తగా వీస్తోంది. వొంటిని లేతపొగలా అల్లుకుంటున్న చల్లదనం. టేబిల్‌కి అటూయిటూ వాళ్లిద్దరు. మధ్యలో తెల్లగులాబి.

ఆర్డర్ ప్లేస్ చేసాక 'భలే వున్నావ్. నీకీ రంగు బాగ నప్పింది. యెంతమంది వుంటారక్కడ' అడిగాడు.

'ఆంటీని చూసావు కదా. ఆమెకి యిద్దరు పిల్లలు. స్టేట్స్ వెళ్లిపోయారు. రెండేళ్లక్రితం అంకుల్ పోయారు. వొంటరిగా అంతింట్లో వుండటం ఆమె వల్ల కాలేదంట. ఆమెని పిల్లలు అక్కడికి రమ్మనలేదంట. పేయింగ్ గెస్ట్గా యిద్దరమ్మాయిల్ని వుంచుకుంటే అనే ఆలోచన వచ్చిందామెకి. యిన్కమ్ ప్లస్ తోడుగా వుంటారనిపించి యిద్దరితో మొదలుపెట్టింది. యిప్పుడు పదిమంది వున్నాం. హైటెక్ సిటీలో పనిచేస్తున్న వాళ్లే యెక్కువ' అందామె.

'యిక్కడ వర్కింగ్ వుమెన్స్ హాస్టల్స్ మెస్‌లు పెరిగాయి కదా' అడిగాడు.

'వూ. బాగ డిమాండ్ వుంది. మంచి ఫుడ్ పెట్టి కాస్త శుభ్రంగా వుంచితే చాలు. అమ్మాయిలు ఆనందంగా జాయిన్ అయిపోతారు' వాజ్‌ని అటూయిటూ కదుపుతూ అందామె.

ఆమె చేతి వేళ్లని వేళ్లతో స్పర్శిస్తూ 'నీకూ నాకూ మధ్య వయస్సులో తేడా వుంది. నీ కంటే దాదాపు పధ్నాలుగేళ్లు పెద్దవాడిని. మాయింట్లో యీ పెళ్లిని యెలా తీసుకుంటారో తెలియదు' అని ఆగాడు.

చాలమంది కుర్రాళ్లు అమ్మానాన్నలని బాధపెట్టే పనులని తమకి నచ్చితే చేసేస్తుంటారు. కానీ పెళ్లి విషయంలో మాత్రం యింట్లోవాళ్లని నొప్పించటం యిష్టం లేదనే సాకునో సెంటిమెంట్‌నో చూపించి యింట్లో వాళ్లని నొప్పించలేక అని చెప్పి కంఫర్టబుల్‌గా తప్పుకుంటారు. నిజానికి వాళ్లకి ప్రేమని జీవితంలోకి అనువదించుకోవాలని వుండదు. కౌశిక్ అలాంటి తరహా కుర్రవాడా?!

'నీకో మంచి అబ్బాయిని చూసి పెళ్లి చేస్తానని చెపుతున్నప్పుడంతా నాలో అలజడి. అన్నీ ఆలోచించా. నా ఎసెన్షియల్ బీయింగ్ నువ్వేననిపిస్తోంది' ఆగాడు.

'యిద్దరు వ్యక్తులు వొక అర్థవంతమైన అవగాహనకి వచ్చామనుకొని కలిసి నడుద్దామనుకునే నిర్ణయానికి రావటం కష్టం. కాని వొకసారి వచ్చాక మిగిలినవన్నీ చిన్ని చిన్ని విషయాలు' అందామె.

పేపర్ నేప్‌కిన్ తీసి అతనో పది పేర్లు రాసి ఆమె వైపు జరిపి 'నువ్వు పిలిచేవాళ్ల పేర్లు రాయి' అన్నాడు.

'మా పేరెంట్స్. తమ్ముడు. చెల్లాయి. ఆంటీ. మాగ్రాండ్ పేరెంట్స్.

అన్నయ్య అంత దూరం నుంచి రాలేదు. మొన్నేగా వెళ్లాడు' అందామె.

'రిజిస్టర్ మ్యారేజ్. డిన్నర్. హనీమూన్‌కి యెక్కడికి వెళదాం'

'మరీ అలా హనీమూన్ అనకు. ముందు యిద్దరం వుండటానికో యిల్లు వెతుక్కోవాలి' అందామె.

* * *

మాధురి సంసారం మొదలుపెట్టిన రెండో నెలకి వో రోజు అంజలి హోటల్‌కి హఠాత్తుగా వచ్చింది.

'సురేష్‌కి నేనంటే చాలిష్టం. నేనే పని చెప్పినా చేసేస్తున్నాడు. అతను కాస్త సెటిల్ అయ్యాక వుద్యోగం మానేస్తాను. ప్రేమగా వుంటున్నాడు' అందామె.

'పోయిన వారమే వద్దామనుకున్నా. యీ సారొచ్చిన గెస్టులు గోవా వూటి వెళ్లాలని సంబరపడ్డారు. నేనక్కడ వుండి వచ్చాను కదా నేహ వెళ్లమంది. ఆ వచ్చిన సోంబేరులకి చిన్నిచిన్ని పిల్లలు కావాలన్నారు. చిన్నిచిన్ని పిల్లలు యెంతమందో ట్రేడ్‌లో. కొందరేమో వో పక్క పిల్లల్ని వెతికో వెతక్కుండానో చక్కగా వ్యాపారంలో నింపేస్తున్నారు. మరో పక్క హెల్త్‌వర్కర్లనో వాలంటీర్లనో కండోమ్స్ పంచిపెట్టేస్తున్నారు. అలా రోగాలని ఆపాలనుకుంటారు. భలే చికాకేసిందనుకోండి. యీ పిల్లల మాట ఆ కస్టమర్స్ వింటారా? సురేష్ త్వరగా సెటిల్ అయితే యిందులోంచి బయటపడిపోవాలండి' అందామె.

అంజలికి కాఫీ తెప్పించి యిచ్చింది.

'వాళ్ల మదర్‌కి ఆరోగ్యం బాగులేదంట. బాగయ్యాక యింట్లో విషయం చెపుతానన్నాడు. సురేష్ జాబ్ మానేసాడు. తన కొత్త బిజినెస్‌కి సంబంధించిన ఆఫీసుని యెస్టాబ్లిష్ చేసే పని చేస్తున్నాడు. కాస్త పనులన్నీ పూర్తయ్యాక జాబ్‌రిజైన్ చేసి నేనూ అక్కడే జాయిన్ అవుతా. మీరెలా వున్నారు' అడిగిందామె.

'పెళ్లి చేసుకున్నాను' అంది మాధురీ

'యింట్లోవాళ్లు చూసారా'

'లేదు నాకే పరిచయం'

'మీ విషయం తెలుసా'

'అన్నీ తెలుసు'

'యెందుకు చెప్పారు? అవసరమా'

'పరిచయం. మెల్లగా స్నేహం. స్నేహంలో మాయిద్దరం జీవితాలని విప్పుకున్నాం. అక్కడ నుంచే యిష్టం. కలసి బతకాలనుకోవటం. చెప్పటం చెప్పకపోవటం వ్యాల్యూ జడ్జిమెంట్ కోసంకాదు కదా. జీవితాన్ని పంచుకోవాలనిపించటం కొంతమందితో మనం సినిమాకి వెళ్లామని కూడా చెప్పడానికి యిష్టపడం. మనకి అనిపించటం ముఖ్యం కదా. మన ఛాయిస్ కదా' అంది మాధురి.

అంజలి కౌశిక్ యెటువంటి వ్యక్తో అని అంచనా వేయటానికి ప్రయత్నిస్తూ 'వోసారి చూడాలి' అనుకుంది.

* * *

మూడు నాలుగు రోజులుగా సురేష్ నుంచి ఫోన్ లేదు. మనిషి కనిపించలేదు. అతనింటికి యెప్పుడూ అంజలిని రమ్మని పిలవలేదు. ఫోన్ చెయ్యొద్దన్నాడు. తమ విషయం టైమ్ చూసుకొని తను యింట్లో చెప్పే సరకు జాగ్రత్తగా వుండాలన్నాడు. యీ మధ్య తరచుగా మూడునాలుగు రోజులు మిస్ అయిపోతున్నాడు. అడిగితే పనులంటాడు. యేం పనులో...

'అంజలి ఫోన్' అంది నేహ

'హాయ్...తల్లీ... యెలావున్నావ్? చాల రోజులైందిరా... చూడాలని పిస్తోంది. బిజీగా వున్నా. అయినా పర్లేదు. వచ్చై' ఆత్మీయంగా సురేష్.

అంజలి కళ్లలో మెరుపు.

'నేహా నే వెళుతున్నా' అంజలి చప్పున బయటకి వచ్చేసింది.

నేహా ఆమె వెళ్లిన వైపు చూస్తూ 'పిచ్చిపిల్ల' అనుకుంది దిగులుగా.

యిద్దరూ ఐస్‌క్రీమ్‌ని పంచుకున్నారు.

'నువ్వు వాళ్లని డిన్నర్‌కి తీసుకువెళ్లు'

'డిన్నర్‌కి'

'యస్'

అంజలి కాసేపు మాట్లాడలేదు.

'డిన్నర్ అంటే...' తిరిగి అడిగింది.

కథా నిలయం
4952
శ్రీకాకుళం

'కొత్తగా అడుగుతున్నావేంటి' సురేష్ నవ్వాడు.

'పాత అర్ధమేనా'

'ఆ'

తిరిగి నిశ్శబ్దం.

'అంజలి మనం కొన్ని విషయాలని పత్తిపనిలా మాట్లాడుకోకుండా వుంటే మంచిది' అన్నాడు సురేష్.

'కర్టెన్ ఆర్ కార్పెట్ యేది మంచిదంటావ్'

'రెండూ'

ఆమె కళ్లల్లో నీళ్లు.

'అరే... యేమిటో పాతివ్రత్యం' చేతి వేలితో కళ్లనీళ్లు తుడుస్తూ అన్నాడు.

అంజలి వెక్కివెక్కి యేడ్చేసింది.

'అంజలి అరే యేంటిది? నాకీ సెంటిమెంట్స్ నచ్చవ్. చికాకు. బి ప్రాక్టికల్. మనం బిజినెస్‌లో కొత్తగా ఎంటరయ్యాం. నిలదొక్కుకోవాలి. బయట అమ్మాయిలని నమ్మలేం. తప్పదు. నువ్వెందుకింతగా వర్రీ అవుతున్నావో అర్థం కావటం లేదు. నే నీతోనే వున్నాను కదా. లేరా...చూడు యీ కళ్లెలా చిన్నబోయాయో. కొన్నాళ్లేరా. తర్వాత నీ యిష్టం. బంగారం. లే...లే' అనునయంగా అన్నాడు సురేష్.

'నో...మనిద్దరం పెళ్లి చేసుకోవాలనుకున్నాం కదా యిలాంటివేం వద్దు' అతని చేతిని చేత్తో పట్టుకుంటూ అందామె.

'అంజలీ నువ్విలా బెంబేలు పడిపోతే యెలా? అసలీ విషయాన్ని అంత భయంకరంగా తీసుకుంటావ్ యెందుకు? సింపుల్‌గా ఆలోచించు. నువ్వే విషయం చెప్పు. మీ యింట్లో వాళ్లు నీకు పెళ్లి చేసే స్థితిలో వున్నారా? లేరు కదా. నీ విషయం తెల్సిన వాళ్లెవరైనా నిన్ను పెళ్లి చేసుకుంటారా? చేసుకోరు కాని నాకు నువ్వంటే యిష్టంరా. మనం మన బిజినెస్‌లో కాస్త నిలదొక్కుకున్నాం అనుకో ఫైనాన్షియల్ ట్రబుల్స్ వుండవే. చిన్ని తల్లివి కదరా లేలే రా రెడీ అవ్వు' ఆప్యాయంగా ఆమె చేతిని చేతుల్లోకి తీసుకొని ముద్దుపెట్టి స్పూన్‌తో ఐస్‌క్రీమ్‌ని తినిపించాడు.

ఆ ముద్దు ఆమెలో నమ్మకాన్ని వెలిగించింది.

ఆమె డిన్నర్‌కి వెళ్లింది.

* * *

వారాలు రోజులు గడిచిపోతున్నాయి.

'పెళ్లెప్పుడు చేసుకుందాం' అడిగింది అంజలి.

'చేసుకుందాం. తొందరేం వుంది. కాస్త బిజినెస్‌లో నిలదొక్కు కున్నాననుకో. యెంచక్కా హనీమూన్ యెంజాయ్ చేయొచ్చు. స్విట్జర్‌లాండ్ వెళదాం. ఆ మంచుకొండల్లో నీతో రొమాన్స్' కొంటెగా నవ్వాడు.

'బిజినెస్‌లో నిలదొక్కుకోడానికి యీ పెళ్లికి యేం సంబంధం' నవ్వుతూనే అడిగింది.

'ఆడపిల్లలైనా మగపిల్లలైనా కుంచించుకుపోయి వుండకూడదు. నువ్వంటే యెందుకిష్టం అంటే చాల ధైర్యంగా గోవా వరకు వెళ్లి పని చేసావ్. యెవరికి చేతనైనట్టు వాళ్లు పని చెయ్యాలి. సంపాదించాలి. యెంజాయ్ చెయ్యాలి. సంపాదించే మార్గాలని వెతకాలి. అవకాశాలని సద్వినియోగం చేసుకోవాలి. మార్కెట్‌లో పెద్దపెద్ద కార్లు తిరుగుతుంటే మనం బస్‌పాస్ క్యూలో నిలబడటం తెలివితక్కువ. యిన్నిన్ని లోన్స్ ఆఫర్ చేస్తుంటే కరెంట్ బిల్లుకి కాయకూరలకి తడుముకోవటం దద్దమ్మల లక్షణం. యింత అందం వుంది. క్యాష్ యిట్. పెళ్లి చేసుకొన్నాక నిన్ను కాలు నేల మీద పెట్టనివ్వను. మన పిల్లలు పబ్లిక్ స్కూల్స్‌లో చదువుకుంటారు. వాళ్లని రోజూ కారులో నువ్వో డ్రైవరో డ్రాప్ చేసి రావొచ్చు. మంచి కారు కొనిస్తా. అతను కారు లోన్‌కి అప్లై చేసి ఆ విషయం ఆమెకి చెప్పకుండా కారు కలల్ని వూహల్ని ఆమెకి యిచ్చాడు.

అతను బయటకి వెళ్లమన్నప్పుడంతా వెళ్లనంటే అతనేమైనా అనుకుంటాడేమోననే సంశయం. అతనిపై కన్సర్న్ లేదనుకుంటాడేమో.

* * *

ఆఫీసులో పంచ్ కొట్టి అంజలి లోపలికి వస్తుంటే 'సురేష్ పెద్ద పిసినారి మనల్నెవరిని పెళ్లికి పిలవలేదు చూడు' అంది నేహ.

అంజలి ఆగి 'సురేష్ పెళ్లా... యెప్పుడూ' ఆదుర్దాగా అడిగింది.

'మూడు రోజులైయిందంట. రాత్రి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించాడు.

హనిమూన్‌కి వెళుతున్నాడంట. బంధువులమ్మాయంట' నేహ చెపుతూనే వుంది.

తనెందుకు సరిగ్గా కనుక్కోలేకపోయింది? అతన్లో యేం చూసి ప్రేమనుకుంది. తనలోని యే భయాలు యిష్టాలు అతను చెప్పినట్టు ఆడించాయి. అతను తనని ప్రేమించలేదా? మరి ఆ వుద్వేగం వుల్లాసం యేమిటి? వాటిని మించిన వుద్రిక్తత యేమిటో? యేదో యెక్కడో తనకి అర్థకావటం లేదు. యెవరినో వొకర్ని పెళ్లి చేసేసుకోవాలని తనేం తపన పడలేదు. అతను తను యిష్టపడ్డారు. పెళ్లి ప్రతిపాదన అతనిదే. యెందుకింత మోసం? యెందుకిలా జరిగింది? యెవరు యెవరి చేతిని యెందుకు పట్టుకున్నారు? తను కనిపించకపోతే అతను తనని వెతుక్కోవటమంతా నటనేనా?! తన అవసరం యేమిటి? యెమోషనల్ కంపెనియనె తన అవసరం. అంత గుంభనంగా యెందుకతను పారిపోవాలి? గుంభనం కాదు దొంగ... ఆమె కళ్లల్లో తెరలు తెరలుగా జ్ఞాపకాలు జలజలా జారిపోతూ....

సురేష్ హనీమూన్ నుంచి తిరిగొచ్చిన వారం తర్వాత అంజలి అతని ఆఫీసుకి వెళ్లింది.

'నాకు డబ్బులు అవసరం. కాఫీ షాప్ ఫ్రాంచీస్ తీసుకుందాం అనుకుంటున్నాను' అడిగింది.

'డబ్బులా...యిప్పుడెక్కడున్నాయి' తేలిగ్గా అన్నాడు.

'నీ డబ్బులు కాదు నావి. నువ్వు తీసుకున్నవి'

'యిప్పుడు లేవు రా... చాల... అతని మాటలని ఆమె పూర్తి చేయనివ్వలేదు.

'రెండు లక్షల వరకూ నీ దగ్గర వున్నాయి. ఎప్పుడిస్తావ్ చెప్పు' తిరిగి అడిగిందామె:

'యిప్పుడేం లేవ్ అంజలి. నాకు పనుంది. తర్వాత మాట్లాడదాం' అన్నాడతను.

'సురేష నీకు అర్జెంటంటే డెబ్బై వేలు వడ్డీకి తెచ్చాను నా గోల్డ్ పెట్టి. నీకు తెలుసు కదా. వో వారంలోగా యిస్తావా' అడిగిందామె.

'చూద్దాం...' పొడిపొడిగా జవాబిచ్చాడు.

ఆ చూద్దాం చూద్దాంగానే వుండిపోయింది. యెంత ప్రయత్నించీ ఆమె తిరిగి ఆ డబ్బులు అతని నుండి తీసుకోలేకపోయింది.

'అతను యింక యివ్వడు. స్నేహంగానో ప్రేమగానో యిచ్చిన వాటికి పత్రాలేం వుంటాయ్. అవి మర్చిపోయి యిక నుంచైనా కాస్త జాగ్రత్తగా వుండు. ముఖ్యంగా డబ్బుల విషయంలో యెవరిని నమ్మకు. నీక్కాస్త యెక్కువ యిన్‌కం వచ్చే యెసైన్‌మెంట్స్ చూస్తాను' వోదార్పుగా చెప్పింది నేహ.

'నేనింక యీ పని మానేసి ఆ కాఫీషాప్ ఫ్రాంచీస్ తీసుకుందాం అనుకున్నా. తిరిగి అదే పని. ఛ్ఛ యెప్పటికి నాకో దారి వస్తుందో' దిగులుగా అంది అంజలి.

'నీకింకా పని యేం చేయగలవ్? యిందులో కాస్త డబ్బులు వస్తాయి. రెండు మూడేళ్లు కష్టపడితే బిజినెస్ మొదలుపెట్టొచ్చు' ధైర్యం చెపుతూనే వుంది నేహ.

తిరిగి అదే వుద్యోగానికి చిరునవ్వుని అద్దుకొని...

* * *

అమెరికా నుంచి వచ్చిన ప్రభుత్వాధికారులకి అన్ని సౌకర్యాలు సరిగ్గా అమరాయో లేదోనని రూమ్స్ లిస్ట్‌ని మాధురీ చెక్ చేస్తుండగా నేహ నుంచి 'అంజలి ఆత్మహత్య చేసుకోపోయింది హాస్పిటల్లో వుంది' అని ఫోన్.

అంజలి ఆత్మహత్యా?!?!......

యెందుకని....సురేష్ విషయమా... అతను వేరే పెళ్లి చేసేసుకొని అప్పుడే యేడాదిన్నర అయింది. యింకే విషయం...మాధురీ మేనేజర్ దగ్గరకి వెళ్లి పర్మిషన్ అడిగింది.

'యెందుకు' అడిగాడతను.

'ఫ్రెండ్‌కి సీరియస్‌గా వుంది' అంజలి ప్రైవసీని గౌరవిస్తూ అంతే చెప్పింది.

'డ్యూటీ అయ్యాక వెళ్లొచ్చు కదా'

'వెళ్లాలి'

'పర్మిషన్ కష్టం'

'లీవ్'

'మీరిప్పుడు వెళ్లిపోతే యెలా'

'సాయంకాలం వరకు అక్కడికి వెళ్లకుండా పని చేయలేను' అందామె.

మేనేజర్‌కి చికాకేసింది.

'చూడు మాధురీ. కెరీర్ తర్వాతే మిగిలిన విషయాలు. యింట్లో వాళ్లంటే

అర్థం వుంది. మనకి మన జీవితంలో అనేక మంది పరిచయం అవుతారు. స్నేహితులుగా మారుతారు. మనకి తెలిసినవాళ్ల పరిధి పెద్దదిగా వుంటుంది. రోజూ యెవరికో వొకరికి యేదో వొక సమస్య వస్తుంటుంది. అందరికి యెక్కడ అటెండ్ కాగలం చెప్పు. టైమ్ పర్మిట్ చేయదు కదా. అవే ముఖ్యం అనుకుంటే యింట్లో కూర్చోవటం మంచిది. నీ యేజ్‌గ్రూప్ వాళ్లంతా యెలా కెరీర్ మీదే చూపంతా నిలుపుతారు. నువ్వేంటో యిలా... మొన్నటికి మొన్న మీ అత్తగారికి బాగులేదన్నావ్... ఆవిడని యెంచక్కా యేజ్డ్ ఫర్ హోమ్‌లో జాయిన్ చేయమంటే వినవే అసలు ను....

'యిట్స్ వోకే. నే వెళుతున్నా' అని లీవ్ - పర్మిషన్ కాగితాలు అక్కడ పెట్టేసి బయటకి వచ్చేసింది.

యీ మధ్య యీ మేనేజర్ ప్రతి విషయానికి కాళ్లకి అడ్డం పడిపోతున్నాడు.

'యిచ్చారా' సహ రిసెప్షనిస్ట్ అడిగింది.

'ప్చ్'

'వెళ్లిపోతే గోల చేస్తాడేమో'

'చేసుకొని' మాధురీ హాస్పిటల్‌కి వచ్చేసింది.

ఎమర్జన్సీ దగ్గర నేహ కనిపించింది.

'అంజలి యింటికి మెసేజ్ యిచ్చా. వాళ్ల అన్నయ్య, అక్క వస్తున్నామని చెప్పారు. వాళ్ల అన్న ఫోన్‌లోనే కెయ్ కెయ్ మంటున్నాడు' అంది నేహ.

సాయంకాలానికి అంజలి అన్నయ్య, అక్క వచ్చారు. అతని ముఖంలో బాధ ఆదుర్దా కోపాల సమ్మేళనం. అక్క వెక్కెక్కి యేడ్చేసింది.

'యేంకాదు కదా...' వెక్కిళ్ల మధ్య మాటలు.

నేహ పోలీసులతో మాట్లాడింది కేసు కాకుండా.

'యెందుకిలా చేసింది' అంజలి అన్నయ్య అడిగాడు.

ఆ ప్రశ్నకి జవాబు వారివారి మనసుల్లో వాళ్లవాళ్లకి తోచిన కారణాలున్నాయ్.

అంజలి అక్క అన్నయ్య ఎమర్జన్సీ దగ్గర కూర్చున్నారు. మాధురీ, నేహ లాంజ్‌లోని కాఫీషాప్‌కి వచ్చారు.

కాఫీ తాగుతూ నేహ 'తాజ్ చూస్తామన్నారు వాళ్లు అంజలితో పంపించా. అటునుంచి వచ్చి ఆఫీసుకి కూడా రాలేదింకా. యిలా యెందుకు చేసిందో....

అంది.

'సురేష్ విషయంలో కూడా తట్టుకొని నిలబడింది. యేమైవుంటుందో' అంది మాధురి.

'వూ... వాడొకడూ...ప్చ్...మధూ... మీరంతా యింత ఫూలిష్‌గా మగవాళ్లని యెలా నమ్ముతారో?! ఆ సురేష్ యేం చేసాడు? తనకి కావల్సిన డబ్బుల్ని సంపాదించుకున్నాడు. వాళ్లు చాల క్యాలిక్యులేటడ్‌గా వుంటారు. యెక్కడో వొకరుంటారు సెన్సిబుల్‌గా కాస్త స్వేచ్ఛగా. సొంతంగా బతికే అమ్మాయిలపై యీ మగవాళ్లకేం గౌరవం ప్రేమా వుండవ్. వున్నట్టు నటించి మనలని వాళ్ల కెరీర్ కోసం సరదాల కోసం వాడుకుంటారు. పైకి మాత్రం మనలని నమ్మించడానికి వో ముసుగు వేసుకుంటారు అంతే' ఖాళీ అయిన ప్లాస్టిక్ కప్‌ని నలిపేస్తూ అంది నేహ.

అంజలీని ఎమర్జన్సీ నుంచి రూంలోకి షిఫ్ట్ చేసారు.

అంజలీ దగ్గర వాళ్ల అక్క వుంటుంది. అన్నయ్య పనుందని వూరెళ్లిపోయాడు. నేహ మాధురీ వుదయం సాయంకాలం వచ్చి చూసి వెళుతున్నారు.

అంజలీ చూపులు టి.వి. స్క్రీన్‌పై వున్నాయి కానీ అవి యేవీ ఆమెలో రిజిస్టర్ కావటం లేదు.

'మాధురీ యింకా రాలేదేంటి' అప్పటికి మూడోసారి అడుగుతోన్న అక్కవైపు స్పష్టంగా చూస్తూ 'యెందుకు? బయటకేమైనా వెళ్లాలా' అడిగింది.

'ఆ యీ రోజు గురువారం. గుడికి వెళ్లాలి. యీ హాస్పిటల్లో ఆంజనేయస్వామి వినాయకుని గుడి వున్నాయంట. సాయిబాబ గుడి దగ్గర్లో వుందేమో కనుక్కుందామని' అందామె.

'హాయ్' అంటూ మాధురీ లోపలికి వచ్చింది వెనకే కౌశిక్.

'గుడికి వెళ్లాలి'... అక్క ఆత్రంగా అడిగింది.

'సాయిబాబా గుడీ...కౌశిక్‌తో వెళతారా? దగ్గర్లో లేదు మీరొక్కరూ వెళ్లలేరేమో' అంది మాధురీ.

వాళ్లిద్దరూ వెళ్లాక మాధురీ ఆమాటా యీ మాట చెపుతూ అంజలితో మాట్లాడించటానికి ప్రయత్నించింది. సినిమాలు పాటలు చీరలు వూహూ... అంజలి చూపులు యెక్కడెక్కడో తిరుగుతూ...

'నన్నెందుకు సేవ్ చేసారు' చప్పున అడిగింది.

మాధురీ చూపుల్లో మౌనం.

'చెప్పు' పెంకిగా తిరిగి అడిగింది అంజలి.

'నీకు సంతోషంగా లేదా'

'యేంటి'

'బతికినందుకు'

'యిందులో సంతోషం వుంటుందా'?

'మన ప్రాణం కంటే విలువైనది యీ ప్రపంచంలో యేమైనా వుందా' మాధురి అడిగింది.

'ప్రేమ... ప్రాణం కంటే గొప్పదనుకున్నా' అందామె.

'ముందు నువ్వు మనిషిపై నమ్మకాన్ని పెంచుకో'

'ఆ నమ్మకం బద్దలయ్యే కదా'

'వ్యక్తులపై కాదు - ప్రేమపై విశ్వాసాన్ని నింపుకో. మనపై మనకి ప్రేమ. గౌరవం.... చుట్టూ పరిస్థితులకి అందరం బందీలమే. అలా ప్రవర్తించటానికి సురేష్‌కి వుండే లాజిక్ సురేష్‌కి వుంటుంది. నేహాకి వుండే సమర్ధన నేహాకి వుంటుంది. వ్యక్తులు మన మీద కుమ్మరించే ప్రేమ మోసాలబట్టే మన ఆనందవిషాదాలని నిర్ణయించే శక్తి వాళ్లకి యిచ్చేస్తే మనం అంతా రోజూ ఛస్తూ బతుకుతూవుంటాం...'

'కౌశిక్ దొరకటం వల్ల నీకీ నిర్భరం వచ్చిందా' అడిగింది అంజలి.

'కౌశిక్‌తో పరిచయానికి ముందు నేనూ కిందా మీద అవ్వటం జరిగింది. యిన్‌ఫర్‌మేషన్ బ్యూరోలా పనికొస్తానని వొకరు. ప్రేమని నటిస్తే ఎటిఎమ్‌లా పనికొస్తానని వొకరూ... యిలా యెవరి పరిధిలో వాళ్లు ప్రవర్తించారు. నాకూ మనుషులు కావాలి. యిమోషనల్ స్నేహం కావాలి. ఆ వెతుకులాటలో అలా మేం వొకరిని వొకరం నింపుకున్నాం. తోడు కొంత నిబ్బరాన్ని యిస్తుంది కానీ పూర్తిగా కాదు. యేదైనా మనలోంచే రావాలి. యే యిమోషన్స్‌కైనా అంచనాలు తలకిందులైనప్పుడు గాయాలు అవుతాయి. మోసుకు తిరుగుతాం బట్...యిలా అయితే యెలా...'

అంజలి ఫకాలున నవ్వింది.

'ప్రేమించే మగవాళ్లుంటారు. బాధపెట్టే వాళ్లూ వుంటారు. యెన్ని

రకాలుగా వాళ్లు హింసించగలరో మనకి చాల చాల బాగ తెలుసు. వాళ్ల మోసాలకి హింసకి తట్టుకోలేక ఆత్మహత్యలే చేసుకోవటం మొదలుపెడితే మన స్త్రీల జనాభా చాల చాల తక్కువుండేది కాదా... స్మశానాలలో చోటే వుండదు. యెవరి యింటి ముందో వెనకో తగలపెట్టుకోవల్సిందే' అంది అంజలి బిట్టర్‌గా నవ్వుతూ.

'మరెందుకిలా' అడిగింది మాధురి.

అంజలి వెక్కివెక్కి యేడ్చింది. బిగ్గరగా అరుస్తూ యేడ్చింది. నిశ్శబ్దంగా కన్నీరు కార్చింది. మౌనంగా వుండిపోయింది. దేహమంతా రోదిస్తుంటే 'ఎయిడ్స్' చెప్పింది.

ప్రాణం పగిలింది.

* * *

'... యేరా నిద్రరావటం లేదా...' కౌశిక్ ఆమె బుగ్గలపై జోకొడుతూ నిద్ర మెలకువలో అడిగాడు.

తడితడిగా ఆమె బుగ్గలు.

'తల్లీ... బుజ్జీ...' లాలనగా అన్నాడు తడి తుడుస్తూ.

'ప్రాణాలకి ముప్పు అని తెల్సి కూడా యిలా యెలా ప్రవర్తిస్తున్నారు' అడిగిందామె.

'యెవరు' నిద్రలోంచి పూర్తిగా బయటకి వస్తూ అడిగాడు.

'వాళ్లే... చాలమంది. అందరికి తెలుసు. రోడ్డు పక్కనున్న సోనాగచ్చి. కామాటిపూర్. అన్నీ తెలుసు. సెక్స్ పెద్ద బిజినెస్. చాల వ్యాపారాలకి సెక్స్ చాల ముఖ్యం. వాళ్లకి ఆకర్షణలన్నీ తెలుసు. అందమైన ప్రదేశాలు చూడండనే బోర్డులున్న చోట యెయిడ్స్ సంబంధించిన బోర్డుని పెట్టనివ్వరు. యిప్పుడు యేదీ చాప కింద నీరులానూ లేదు కార్పెట్ కింద దుమ్ములానూ లేదు రిజర్వాయిర్....క్లాస్ క్యాస్ట్ జండర్... లాభం లేదు. యెవరి ప్రాణాలూ జీవనం యెవరి చేతుల్లోనూ లేదు. ఆ రోజు అంజలి విషయం తెల్సినప్పుడు యెంత భయం వేసింది నాలోనూ ఆ వైరస్ వుందేమోనని. టెస్ట్ చేయించుకోడానికి రిపోర్ట్ చూడ్డానికి మధ్య ప్రాణమెంత గిలగిలలాడింది. వైరస్ లేదని తెలిసి యెంతో రిలీఫ్‌గా అనిపించింది. వాళ్ళెల్లనేంటి...యిదో ఛెయిన్. తెలిసి తెలిసి యిన్నేసి

ప్రలోభాలని అందరిపై వాళ్లు యెందుకు కుమ్మరిస్తున్నారు? యెవర్ని యెవరు రక్షిస్తారు' ఆమె కళ్ల నిండా నీళ్లు.

అప్పుడప్పుడూ మాధురీ అలా డిస్టర్బ్ అవ్వటం అతనికి అనుభవమే.

'మధూ... వర్రీకాకురా. మనం బానే వున్నాం కదా. యెందుకలా దిగులుపడతావ్. మన పిల్లల్ని మనం కేర్‌ఫుల్‌గా... బై ఆల్ మీన్స్ పెంచుదాం. అయినా ఎయిడ్స్ వస్తే యెందుకంత కంగారు. చాల వాటికి మందులు లేవ్ యీ ప్రపంచంలో. వున్నా అందరికి అందుబాటులో లేవ్. హెచ్.ఐ.వి. వైరస్ వుందనుకో యేమవుతుంది. యిమ్యూన్ సిస్టమ్ కేర్ తీసుకుంటే కోపప్ అవుతారుకదా. చాలుకదా. వెంటనే ప్రాణాలకేం కాదు కదా... బోల్డన్ని యేళ్లు మామూలుగానే వుండొచ్చు పడుకో...' కళ్లనీళ్లతో తడిసిన ముంగుర్లను మెల్లగా వెనక్కి నిమురుతూ ఆమె చేతి వేళ్లలో తన చేతి వేళ్లలోకి తీసుకొని ఆ చేతిని తన గుండెల్లో దాచుకుంటూ మెల్లగా నిద్రపోయాడు కౌశిక్.

ఆమెకి నిద్ర పట్టటం లేదు.

అంతేనా... యిలానే వుంటుందా జీవనం... మరి పిల్లల్ని యెవరు జాగ్రత్తగా పెంచటం లేదు? అందరూ పెంచుతునే వున్నారు. మనం బాగున్నామా? మన చుట్టూ లోకం తగలడిపోతుంటే మనకి ఆ సెగ అంటదా...

నిద్రలోంచి డాలీ యేడుపు వినిపిస్తోంది. పాపని యెత్తుకొని వంట గదిలోకి వెళ్లి పాలు వెచ్చపెట్టి పాపకి పట్టించి లాలించి నిద్రపుచ్చి వచ్చి మంచంపై వాల్తూ కౌశిక్ వైపు చూసింది. మత్తు నిద్ర. అమాయక నిద్ర. అతని నుదిటి చివర్న ముద్దుపెడుతూ పక్కపై వాల్తూ యేం చెయ్యాలి... చెయ్యాలి... యీ సమస్తాన్ని యేం చెయ్యాలి... యేం చెయ్యలేమా... చెయ్యా..లి. ఘర్షణా కనుచూపుల్ని అప్రయత్నంగా కమ్ముకుంటున్న కలత నిద్ర... రవ్వంత వుదయపు వెలుగులో ఆమెకి మెలకువ వచ్చీ రాగానే యేదో తెలియని బెంగ శరీరమంతా వొత్తుగా చుట్టుకొంది.

ఆమె మళ్లీ మంచం మీద అనీజిగా గోడవైపుకి తిరిగి పడుకునేంతలోగా చిట్టి మెత్తని చెయ్యి ఆమెపై. మాధురి తలతిప్పి చూసింది. డాలీ తుళ్లింతగా నవ్వుతూ బయటికి లాక్కుపోయింది. బాల్కనీ నిండా వాన. వడగళ్ల వాన. నిండిపోయిన నీళ్లు. కిందంతా పిల్లల కేరింతలు. గొడుగులు విసిరేసి పుస్తకాలు పారేసి అరుపులే అరుపులు... సందడి... అమ్మలు నాన్నలు అమ్మమ్మలు వొక్కొక్కరే తడిసి ముద్దవుతూ... పడవ... పడవ... డాలీ న్యూస్ పేపర్‌తో...

పర్‌పర్‌పర్... వార్తలు ముక్కలు ముక్కలుగా... యే పడవ... కత్తి పడవ... పూల పడవ... తెరచాప పడవ సారంగి... పడవలు కాగితప్పడవలు... మాధురి. పడవలిస్తూంది... పిల్లల కేరింతల్లో తనూ కేరింతై వడగళ్లని దోసిలినిండా నింపుకొంటూ... విసురుతూ... వదిలేస్తూ...

♦